తాగునీటికి కటకట

- రామవరంలో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- వేసవి ముగిసినా తీరని సమస్య
- కిన్నెరసాని నీరు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి



రామవరంలో కిన్నెరసాని నీరు పట్టుకుంటున్న మహిళలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): వేసవి ముగియడానికి వచ్చినా రామవరంలోని ఏడు వార్డులలో మంచినీటి సమస్య తీరడం లేదు. అసలే కిన్నెరసాని నుంచి తాగునీటి సరఫరా సరిగా జరగడం లేదు. దీనికి తోడు మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా మిషన్ భగీరథ పైపులైన్ల కోసం జరుపుతున్న తవ్వకాల కారణంగా కిన్నెరసాని పైపులైన్లు ధ్వంసమవుతున్నాయి, ఇదో కారణం కాగా పైపులైన్ల లీకేజీ కారణంగా కూడా కిన్నెరసాని నీరు పంపిణీ జరగడం లేదు.

దీంతో రామవరం ప్రజలు తీవ్ర నీటిఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఒకవేళ కిన్నెరసాని నుంచి తాగునీటిని విడుదల చేస్తున్నా లీకులు, పైపుల ధ్వంసం కారణంగా ఎక్కడిక్కడ నీరు వృథాగా రోడ్లపై పారుతున్న దుస్థితి నెలకొంది. అధికారులు కిన్నెరసాని నుంచి తాగునీటిని విడుదల చేసిన సందర్భంగా గతంలో గంటపాటు నిరాటంకంగా నీరు సరఫరా అయ్యేది. కానీ ఇటీవల అర్ధగంట మాత్రమే నీరు విడుదల చేస్తుండడంతో తాము తీవ్ర నీటిఎద్దడిని ఎదుర్కొంటున్నట్లు ప్రజలు వాపోతున్నారు. అంతేకాకుండా కొంతమంది నీటి విడుదల సందర్భంలో కొంతమంది మోటార్లు వినియోగిస్తుండడం వల్ల సమీప ప్రాంత ప్రజలకు తాగునీటి సరఫరా జరకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరికొంత మంది తాము మోటార్లు వినియోగిస్తున్నా డ్రమ్ము నీరు కూడా నిండడం లేదని ఆవేదన చేస్తున్నారు. పైపుల విధ్వంసం, పైపులైన్ల లీకేజీల కారణంగా తమకు కిన్నెరసాని తాగునీరు అందక సతమతమవుతున్నట్లు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాలలో సమస్య తన దృష్టికి వచ్చినపుడు వాటర్ ట్యాంకుల ద్వారా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చొరవతో నీటిని పంపిణీ చేయడం కొంత ఉపశమనం. కిన్నెరసాని తాగునీటిని విడుదల చేస్తున్న సందర్భంలో పంపుల నుంచి తాగునీరు సరిగా రాకపోవడంతో భూమిలో ఉన్న పైపులైన్లను తొలగించి వాటర్‌పైపులను ఏర్పాటు చేసుకుని చెలిమల నుంచి నీరు తోడుకున్నట్లు పలుప్రాంతాలలో నీటిని పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి ఎద్దడి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సక్రమంగా సరఫరా చేయాలి..



కిన్నెరసాని జలాలను సక్రమంగా సరఫరా చేసి తాగునీటి సమస్యను తీర్చాలి. వేసవి కావడంతో ఇళ్లలో నీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. అధికారులు స్పందించి నీటిఎద్దడిని నివారించాలి. – జి.రాజేశ్వరి, రామవరం

గతంలో ఎప్పుడూ ఇలా లేదు..



గతంలో ఎప్పుడూ ఇంత నీటి సమస్య రాలేదు. వస్తున్న నీటిని ఎంత పొదుపుగా వాడుదామన్నా సరిపోవడం లేదు. కిన్నెరసాని తాగునీటిని సరఫరా చేసే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. – అబ్దుల్ సలీం, రామవరం

క్లుప్తంగా

రేపు జాబ్‌మేళా

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 18న కొత్తగూడెంలోని వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్(లక్ష్మీదేవిపల్లి)లో ఖాళీగా ఉన్న 33 పోస్టుల భర్తీకి జిల్లా ఉపాధి కల్పనా శాఖ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్ 25, ఒక డ్రైవర్, ఐదు సెక్యూరిటీ, రెండు టెలీకాలర్ పోస్టులకు నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలి

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి కార్మికులు, అధికారులు, ఉద్యోగులు, సూపర్‌వైజర్లు కృషి చేయాలని ఇల్లెందు ఏరియా జనరల్ మేనేజర్ వీసం కృష్ణయ్య అన్నారు. సోమవారం ఉత్పత్తి, ఉత్పాదకతపై కేటీసీలో అధికారులతో సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు అధిక ఉత్పత్తి, రక్షణతో పాటు నాణ్యత కూడా చాలా ముఖ్యమన్నారు. బొగ్గు నాణ్యతలో సూపర్‌వైజర్‌లే కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు.

తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికలు...

ఇల్లెందురూరల్: హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం ఈ నెల 18న పట్టణంలోని సింగరేణి హైస్కూల్‌లో ఉదయం 9 గంటలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ ఉమాశంకర్ తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎంపికలో పాల్గొనే విద్యార్థులు నాలుగో తరగతి చదువుతూ.. 2017 ఆగస్టు 31 లోపు జన్మించి ఉండాలని చెప్పారు.

19న గురుకుల కాలేజీలో..

పాల్వంచరూరల్: క్రీడాపాఠశాలలో నాలుగో తరగతి ప్రవేశాలకు ఈనెల 19న లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల మైదానంలో ఉదయం 10 గంటల నుంచి ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ శ్రీరామ్మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒరిజినల్ ఆధార్‌కార్డు, 4వ తరగతి స్టడీ సర్టిఫికెట్, ఐదు పాస్‌ఫొటోలు వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఇల్లెందు: సీఐటీయూ అనుబంధం ఆర్టీసీ స్టాఫ్ అండ్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను సోమవారం ఇల్లెందు బస్టాండ్ ఆవరణలో కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్‌ఏ నబీ మాట్లాడుతూ.. ఈ నెల 21, 22 తేదీల్లో ఖమ్మంలో జరగనున్న మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. డిపో అధ్యక్షుడు ఐ.వెంకటేశ్వర్లు, కృష్ణ, అంజయ్య, నూర్ బాషా, వెంకటయ్య, అశోక్ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ కమిటీ ఏకగ్రీవం

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండల జర్నలిస్టుల ప్రెస్ క్లబ్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా శంకర్, అధ్యక్షుడిగా రాజశేఖర్, పురుషోత్తం ప్రధాన కార్యదర్శిగా యాకుబ్ పాషా, సహాయ కార్యదర్శిగా మురళీ, నాగరాజు, కోశాధికారిగా వెంకట్, క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా వాహబ్, రాజేందర్, షఫీ, ప్రసాద్, సతీష్, అశోక్‌లను ఎన్నుకున్నారు.

19న చలో హైదరాబాద్

టేకులపల్లి: వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 19న హైదరాబాద్ నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో జరిగే మంద కృష్ణ మాదిగ సన్మాన సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ టేకులపల్లి మండల ఇన్‌చార్జ్ నల్లగట్ల వెంకన్న పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. బోడ అమ్మి, బానోత్ బిక్కులాల్, తేజావత్ రాజేష్, మాలోత్ బద్రు, ధరావత్ జగదీష్ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

టేకులపల్లి: అడవుల్లోని ఖనిజ నిక్షేపాలను, వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూసే ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 17న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శంకర్, చందా, మంచ, రమేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయండి..

జూలూరుపాడు: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయాలని మాల మహానాడు మండల అధ్యక్షుడు బడుగు వీరస్వామి సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూలూరుపాడు మండలంలో 10 ఎంపీటీసీ స్థానాల్లో ఐదు జనరల్, ఐదు ఎస్టీలకు కేటాయించగా ఒక్క స్థానం కూడా ఎస్సీలకు కేటాయించలేదని, రెండు స్థానాలు ఎస్సీలకు కేటాయించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు 'రాజకీయం'



కేటీఆర్‌తో వనమా వెంకటేశ్వరరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజల పక్షాన కాంగ్రెస్‌ను నిలదీస్తే ఏసీబీ నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్షే అని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు ధ్వజమెత్తారు. కేటీఆర్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు వనమా రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెం నియోజకవర్గం నుంచి ప్రదర్శనగా తెలంగాణ భవన్‌కు బీఆర్ఎస్ శ్రేణులు చేరుకున్నారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడారు. పరిపాలనలో విఫలమైన కాంగ్రెస్ పార్టీ కావాలనే ప్రతిపక్ష నేతలను తప్పుడు కేసులలో ఇరికించి విచారణ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. పార్ములా – ఈ కేసులో మళ్లీ కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలను అమలు చేయక పోవడంతో వాటిని ప్రశ్నించిన కేటీఆర్‌పై రాజకీయ కక్షతో నోటీసులు ఇస్తున్నారని విమర్శించారు.

ఇల్లెందు: విచారణ పేరుతో కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చి వేధింపులకు పాల్పడటం కక్ష సాధింపులో భాగమేనని బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యులు దిండిగల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ఆరోపించారు. సోమవారం హైదరాబాద్ వెళ్లినవారు కేటీఆర్‌కు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. హైదరాబాద్ వెళ్లిన వారిలో రంగనాథ్, జాఫర్ హుస్సేన్, బొమ్మెర వరప్రసాద్, ధాస్యం ప్రమోద్‌కుమార్, మూడు కృష్ణప్రసాద్, అబ్దుల్ నబీ, గిన్నారపు రాజేష్, హరికృష్ణ, చంద్రావతి, చాంద్‌పాషా, నిఖిల్, మునిగంటి శివ ఉన్నారు.

నాలుగో ఆర్థిక శక్తిగా భారతదేశం

జూలూరుపాడు: బీజేపీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో ప్రపంచంలో నాలుగో ఆర్థిక శక్తిగా భారతదేశాన్ని తయారు చేసిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ ఆకుల నాగేశ్వరరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం పడమటనర్సాపురం గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో రచ్చబండ నిర్వహించారు. మాట్లాడుతూ.. దేశానికి పల్లెలు పట్టుగొమ్మలని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. తెల్లం నరసింహారావు దొర, బాల్ రెడ్డి, రమేష్, రామారావు, బొర్రా అరుణ, కిన్నెర వెంకమ్మ పాల్గొన్నారు.

ఇల్లెందు: దేశంలో మోదీ 11 ఏళ్ల పాలన అంతా సుపరిపాలనే అని బీజేపీ రాష్ట్ర నాయకుడు బోడా పూన్యా నాయక్ అన్నారు. సోమవారం ఇల్లెందులోని 14 నంబర్ బస్తీలో ఆయన మాట్లాడుతూ.. భారత్ ప్రపంచ దేశాల సరసన అగ్రస్థానంలో నిలిపిన ఘనత మోదీకే దక్కిందన్నారు. సుచిత్ర పాసీ, చిక్కా వెంకటేశ్వర్లు, శాసనాల రామయ్య, సునీత తదితరులు పాల్గొన్నారు.

కార్మిక శాఖ సంక్షేమ బోర్డు నిర్వహించండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ప్రైవేటీకరణను ఆపాలని బీడబ్లూసీ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు వేల్పుల మల్లికార్జున్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, జిల్లా లేబర్ కమిషనర్ ఎండీ షర్ఫుద్దీన్‌లకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. మల్లికార్జున్ మాట్లాడుతూ... అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును 2009 నుంచి 2024 వరకు విజయవంతంగా నడిపించిన కార్మికశాఖ ప్రస్తుతం అనేక కారణాలను చూపుతూ ప్రైవేటీకరించేందుకు ఈనెల 4న నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. దీనిని పోరాటాలతో అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్మికశాఖ ఆధ్వర్యంలోనే సంక్షేమ బోర్డును నిర్వహించాలని, కార్మికశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పెన్షను రెండు శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. కోరి కృష్ణ, ధరావత్ గోపి నాయక్, పున్నయ్య పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాలను నిలిపివేయాలి

సింగరేణి(కొత్తగూడెం): ఉద్యోగాల పేరుతో సాధా కంపెనీ నిర్వహిస్తున్న ఉద్యోగ నియామకాల ప్రక్రియను నిలిపివేయాలని సింగరేణి కాంట్రాక్ట్ జేఏసీ నాయకులు కోరారు. సోమవారం బాబుక్యాంపులోని వారి కార్యాలయంలో కంపెనీ నిర్వాహకులకు జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. నాలుగు రోజులుగా కొత్తగూడెం ఏరియాలోని వీకే–7ఓసీ పేరుతో సాధా కంపెనీ నిర్వహిస్తున్న సింగరేణి ఓబీకి డ్రైవర్లు, ఆపరేటర్లు, హెల్పర్లు, సూపర్‌వైజర్లు కావాలని, ఉద్యోగాల పేరుతో ప్రకటనలు ఇవ్వటం సరికాదన్నారు. ఓబీలో ఏ నియామకం చేపట్టాలన్న సింగరేణి యాజమాన్యం చేపడుతుందని, వాట్సప్‌లో ప్రకటన ఇవ్వటం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఉద్యోగ నియామకాలు చేపట్టటానికి ఆ కంపెనీకి ఎలాంటి అనుమతులు లేవన్నారు. ఈ విషయమై తాము సింగరేణి ఉన్నతాధికారులతో గతంలో చర్చించామని, మళ్లీ వారిని సంప్రదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.సంజీవ్, ఆల్బర్ట్, శివమోహన్, గడిపెల్లి కృష్ణప్రసాద్, భుక్యా రమేష్, గొని నాగేశ్వరరావు, రవిగౌడ్, ఆంజనేయులు, రఘు తదితరులు పాల్గొన్నారు.

టీయూసీఐ మహాసభలను విజయవంతం చేయాలి

పాల్వంచ: 21, 22 తేదీల్లో నిజామాబాద్‌లో జరగనున్న టీయూసీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల రమేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక కేజీబీవీ హాస్టల్‌లో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. 21న భారీ కార్మిక ప్రదర్శన, 22న ప్రతినిధుల సభ జరుగుతుందని, అన్ని రంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులు చాలీచాలనీ వేతనాలతో పనిచేస్తూ వారి కుటుంబ పోషణ భారమై ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. కార్మికవర్గానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. .

ఇల్లెందు: నిజామాబాద్‌లో జరగనున్న టీయూసీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం ఇల్లెందు ఏరియా కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ కోరారు. సోమవారం సింగరేణి జేకే సివిల్ డిపార్ట్‌మెంట్‌లో కార్మికుల మస్టర్ వద్ద వారు మాట్లాడారు. కార్మికుల సమస్యలను చర్చించేందుకు ఈ నెల 21,22 తేదీల్లో జరగనున్న మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర మహాసభలను..

చుంచుపల్లి: ఈ నెల 21, 22 తేదీల్లో ఖమ్మంలో జరగనున్న స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పలువురు యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ప్రచారంలో భాగంగా సోమవారం ప్రచార జీపుజాతా కొత్తగూడెం డిపోకు చేరుకుంది. ఈ సందర్భంగా మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఎ.వెంకటేశ్వరావు, బి.సుధాకర్, పి.సుధాకర్, జె.నాగేశ్వరరావు, టి.బాబు, బాణాల రాంబాబు, వైఎస్ రావు, శివరామకృష్ణ, బత్తుల నాగేశ్వరావు, ఇసనపల్లి శామ్యూల్, రామకృష్ణ, ఫర్వీన్, నూర్జన్ పాల్గొన్నారు.

'గుర్తింపు సంఘం విఫలం'



మాట్లాడుతున్న త్యాగరాజన్

టేకులపల్లి: సింగరేణిలో కార్మికుల హక్కులను కాపాడటంలో, సమస్యల పరిష్కారంలో గుర్తింపు సంఘం విఫలం అయిందని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, జనరల్ సెక్రెటరీ ఆల్బర్ట్, వైస్ ప్రెసిడెంట్ జే.వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం కోయగూడెం ఓపెన్ కాస్ట్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. కార్మికుల పరిరక్షణ ఐఎన్‌టీయూసీతోనే సాధ్యం అవుతుందన్నారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఐఎన్‌టీయూసీ యూనియన్ నిరంతరం కృషి చేస్తోందని, ముఖ్యంగా మారుపేర్ల మార్పు సమస్య పరిష్కార దిశగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని చెప్పారు. ఈ సందర్భంగా పిట్ సెక్రటరీగా కోసూరి సత్యనారాయణ, ఇల్లెందు ఏరియా చీఫ్ ఆర్గనైజషన్ సెక్రటరీగా అజ్మీరా ఉపేందర్‌లను ప్రకటించారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ భూక్యా నాగేశ్వరరావు, మహబూబ్, తోట వెంకటేశ్వర్లు, రాకం అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై మెగా డ్రైవ్

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామంలోని కంటెమ్ శ్రీహరి, వెంకయ్య 11 ఎకరాల ఆయిల్‌పామ్ క్షేత్రంలో మెగా ఆయిల్ ఫెడ్ కంపెనీ వారి ఆధ్వర్యంలో సోమవారం ఆయిల్‌పామ్ మెగా డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జంగ కిషోర్ పాల్గొని మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగు వలన ప్రయోజనాలు, ప్రభుత్వ రాయితీలను రైతులకు వివరించారు. ఆయిల్‌పామ్ తోటలు వేసుకుంటే నాలుగో సంవత్సరం నుంచి 35 సంవత్సరాల వరకు ఆదాయం పొందవచ్చన్నారు. ఎకరానికి రూ.1 లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు ఆదాయం వస్తుందని, ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు, విత్తన క్షేత్రం కూడా అందుబాటులో ఉన్నాయని, ఫీల్డ్ ఆఫీసర్లు కూడా రైతులకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

పాల్వంచ: కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారం నిర్మాణంలో పనిచేసిన కార్మికులను యాజమాన్యం ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోనేరు సత్యనారాయణ (చిన్ని) అన్నారు. సోమవారం కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో 83 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈ సందర్భంగా కోనేరు సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నిర్లక్ష్యం వల్ల కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు. పాత ప్లాంట్ మూసేయడం వల్ల ఇక్కడ పనిచేస్తున్న వేలాది కార్మికులు బీటీపీఎస్, వైటీపీఎస్‌లకు తరలిపోయినట్లు చెప్పారు. చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, యాజమాన్యం గతంలో కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలు కల్పించాలన్నారు.

కార్మికులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. అనంతరం కేటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకర్‌రావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏనుగుల అర్జున్‌రావు, కృష్ణ, దేవీలాల్ నాయక్, గణేష్, అరుణ్, లాల్‌సింగ్, హాతీరాం, మురళీకృష్ణ, లక్ష్మణ్, చంటి, వివిధ సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

రైతు వేదికల్లో రైతు నేస్తం



ఇల్లెందురూరల్: రేపల్లెవాడలో రైతు నేస్తం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న రైతులు, అధికారులు

జూలూరుపాడు: పాపకొల్లు, పడమటనర్సాపురం, కాకర్ల రైతు వేదికల్లో సోమవారం రైతు నేస్తం కార్యక్రమం జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి మాట్లాడారు. తొమ్మిది రోజుల్లో రైతులందరికీ రైతు భరోసా నిధులు జమ చేయనున్నట్లు సీఎం చెప్పారు. ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, ఏఓ దీపక్ ఆనంద్, ఎంపీఓ తులసీరామ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: పాయకారియానంబైల్, జగన్నాథపురం గ్రామాల్లోని రైతువేదికలో సోమవారం జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో అధికారులు, నాయకులు, రైతులు హాజరయ్యారు. సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు. ఎంపీడీఓ.కె.విజయభాస్కర్‌రెడ్డి, ఏడీఏ నర్సింహారావు, ఏఓ శంకర్, ఏపీఎం రాంబాబు, ఏపీఓ రంగా, ఏఈఓలు నరేష్, భువనేశ్వరి, కార్యదర్శి మధు పాల్గొన్నారు.

టేకులపల్లి: రైతులతో అనుసంధానమై సీఎం మాట్లాడే వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని సోమవారం ప్రెగళ్లపాడు, బోడు, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ రైతువేదికల నుంచి రైతులు వీక్షించారు. ఏఓ ఎస్.అన్నపూర్ణ, హార్టికల్చర్ ఆఫీసర్ స్రవంతి, ఏఈఓ కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: రైతు భరోసా నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సతీష్ సూచించారు. రేపల్లెవాడ, కొమరారం, సుదిమళ్ల రైతు వేదికలలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని సోమవారం రైతులు వీక్షించారు. అనంతరం ఏఓ మాట్లాడారు.

లారీ ఓనర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా అనిల్‌కుమార్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ఐఎంఏ హాల్‌లో సింగరేణి టిప్పర్స్ అండ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిసాయి. నాలుగేళ్లుగా వివిధ కారణాలతో వాయిదా పడుతున్న ఈ ఎన్నికలను నిర్వహించాలని నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు ఈరోజు ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా బూర్గుల అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు.

రోస్టర్ రిజిస్టర్ పరిశీలన

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో సోమవారం ఉద్యోగుల రోస్టర్ రిజిస్టర్‌ను ఎస్సీ చీఫ్ లైజన్ ఆఫీసర్, మణుగూరు ఏరియా జీఎం డి.రామచందర్ ఆధ్వర్యంలో వెరిఫికేషన్ నిర్వహించారు. అనంతరం ఉద్యోగుల పదోన్నతులు, నియామకాల రిజిస్టర్‌ను పరిశీలించారు.

నేటి నుంచి వరి విత్తనాల పంపిణీ

జూలూరుపాడు: స్థానిక సొసైటీ కార్యాలయంలో మంగళవారం నుంచి వరి (బీపీటీ 5204) విత్తనాలను రైతులకు పంపిణీ చేయనున్నట్లు జూలూరుపాడు సొసైటీ చైర్మన్ చీమలపాటి భిక్షం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25 కిలోల బ్యాగు రూ.1075 అని, రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ ఇచ్చి తీసుకోవాలన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన ఉండాలి

ఇల్లెందురూరల్: క్షయ వ్యాధి నివారణపై ప్రతీఒక్కరికీ అవగాహన ఉండాలని డాక్టర్ ప్రియాంక, డాక్టర్ రూపచందూనాయక్ సూచించారు. ఒడ్డుగూడెం గ్రామంలో కొమరారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం క్షయ ముక్త్ భారత్ క్యాంపు నిర్వహించారు. మాట్లాడుతూ.. క్షయ వ్యాధి ఊపిరితిత్తులకు సంబంధించినదైనా చర్మం నుంచి మెదడు వరకు ఏ భాగానికైనా వచ్చే అవకాశం ఉందన్నారు.

మావోయిస్టులకు దూరంగా ఉండండి..

పాల్వంచరూరల్: మావోయిస్టు నక్సల్స్‌కు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, మావోల ప్రలోభాలకు గురికావొద్దని సీఐ కె.సతీష్ అన్నారు. మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న రాళ్లచెలక గుత్తికోయల గుంపు గ్రామాన్ని సోమవారం ఎస్ఐ.సురేష్‌తో కలిసి సీఐ సందర్శించారు. ఈ సందర్భంగా గుత్తికోయ గిరిజనులతో సమావేశమై మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధి నిరోధకులైన మావోయిస్టు నక్సల్స్‌కు సహకరించవద్దని, మావోయిస్టుల కదలికలు తెలిసినా, కొత్త వ్యక్తులు బయట నుంచి వచ్చినా.. ఆ సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారం చేసే విధంగా చూస్తామన్నారు.

మున్సిపాలిటీకి ఆదాయం సున్నా..

- సా...గుతున్న మోడల్ మార్కెట్ పనులు
- లలిత కళామందిర్ రోడ్డులో ఎవరికీ నచ్చని ఆరు గదులు
- అడుగు పెట్టేందుకు ససేమిరా అంటున్న వ్యాపారులు



లలిత కళామందిర్ రోడ్డులో మున్సిపల్ కాంప్లెక్స్




మోడల్ మార్కెట్‌లో నిర్మాణ పనులు

ఇల్లెందు: పట్టణ నడిబొడ్డున నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లు ప్రారంభోత్సవం జరిగినా కేటాయింపునకు జాప్యం జరుగుతోంది. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌ను కేటాయిస్తే తద్వారా మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతుంది. లలిత కళామందిర్ రోడ్‌లో రెండేళ్ల క్రితం సుమారు రూ.1.50 కోట్లతో 32 గదుల నిర్మాణం చేపట్టారు. కింది అంతస్తులో 16 గదులు, పైఅంతస్తులో మరో 16 గదులు నిర్మించారు. ఇటీవల రిజర్వేషన్ ప్రకారం గదులు కేటాయింపు కోసం నోటిఫికేషన్ విడుదల చేశారు. మరో ఆరు గదులు ఎవరూ తీసుకోలేదు. ఇటీవల ఎవరు తీసుకున్న గదులను వారికి కేటాయించారు. ఇంకా ఈ గదుల ద్వారా ఆదాయం రావడం లేదు.

నత్తనడకన మార్కెట్ పనులు..


పట్టణ నడిబొడ్డున మోడల్ మార్కెట్ నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. మూడేళ్ల క్రితం రూ.9 కోట్లతో 192 గదులతో మోడల్ మార్కెట్ నిర్మించారు. అయితే పూర్తి స్థాయిలో పనులు జరగలేదు. దీంతో మరో రూ.కోటి కేటాయించారు. ఆ పనులు సా...గుతున్నాయి. ఈ క్రమంలో మున్సిపల్ పాలకవర్గం గదులు కేటాయింపును పూర్తి చేసింది. పలుమార్లు వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయ సేకరణ చేసింది. దరఖాస్తులు స్వీకరించి లాటరీ పద్ధతిలో గదులు కేటాయించింది. పట్టణంలో రోడ్డు వెడల్పు చేసి డివైడర్ నిర్మాణం చేసినప్పటికీ చిరు వ్యాపారులు రోడ్ల మీదనే వ్యాపారం చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. కింది అంతస్తులో గదులకు ప్రతీనెల రూ.2 వేలు, పై అంతస్తులో గదులకు రూ.1500 కిరాయి చెల్లించాల్సి ఉంది. కూరగాయలు, మాంసం, చికెన్, చేపలు, ఎండు చేపలు, పండ్లు ఇలా వివిధరకాల దుకాణదారులు అంతా మోడల్ మార్కెట్‌లోనే క్రయ విక్రయాలు చేసుకోవాల్సి ఉంది. కానీ విద్యుత్ మీటర్లు, డ్రెయినేజీ, మరుగుదొడ్లు, మూత్రశాలలు, రోడ్లు, ప్రహరీ లేకపోవడంతో ఆ గదులలోకి వెళ్లమని వ్యాపారులు భీష్మించుకున్నారు. దీంతో రూ.కోట్లు ఖర్చు చేసినా ఆరు నెలలుగా మున్సిపాలిటీకి చిల్లి గవ్వ కూడా ఆదాయం రావడం లేదు.

సదుపాయాలు కల్పించాలి..



మోడల్ మార్కెట్‌లో వ్యాపారులకు, వినియోగదారులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలి. తాగునీరు, డ్రెయినేజీ, మరగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలి. వ్యాపారులకు కేటాయించిన షాపుల్లో వ్యాపారం చేసుకునేలా చూడాలి. చిరు వ్యాపారులందరికీ అవకాశం కల్పించాలి. – గోపి, కూరగాయల వ్యాపారి

విద్యుత్ మీటర్లు లేవు..



మోడల్ మార్కెట్‌లో సిమెంటు పనులు జరుగుతున్నాయి. విద్యుత్ మీటర్లు డిమాండ్ ఉంది. దానివల్ల జాప్యంగా జరుగుతోందది. త్వరలో మోడల్ మార్కెట్‌తో పాటు లలిత కళామందిర్ రోడ్డులోని దుకాణాలన్నింటి నుంచి మున్సిపల్‌కు ఆదాయం వచ్చేలా చేస్తాం. – సీహెచ్ శ్రీకాంత్, కమిషనర్, ఇల్లెందు